వాంటెడ్ టెనెంట్

భమిడి వెంకటేశ్వర్లు

అప్పారావులో బెంగ, విచారం, భయం, ఆందోళన, చికాకు, కోపం వారం రోజుల క్రితం నుంచి చోటు చేసుకున్నాయి. ఇవన్నీ అతన్ని బాధిస్తున్నాయి. ఈ బాధ నుంచి బయటపడాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బు అతనికి లేకపోలేదు. కాని అది యిల్లు గడవటానికి సరిపోదు. జీతంతో పాటు, యింటి అద్దె తోడై వేణ్ణీలకు చన్నీళ్ళలా కలిసిపోవటంతో యీ పదేళ్ళు సాఫీగా గడిచిపోయాయి. కాని ప్రస్తుతం ఆ యిల్లు ఖాళీ అయింది వారం రోజుల క్రితం. ఆ యింట్లో వున్న సుందరమ్మగారు హటాత్తుగా యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఓ వైపు అప్పారావుకి ఆవిడ వెళ్ళిపోయినందుకు ఆనందంగానే వుంది. కొత్తవారికి ఎక్కువ అద్దె చెప్పవచ్చునన్న కారణంతో.

అయితే ఆ రోజు నుంచే అప్పారావుకి అసలు కథ ఆరంభమైంది. నగరంలో యిళ్ళ కొరత బాగా వుంది. ఇల్లు దొరకడం అంటే పార్టీ టిక్కెట్టు దొరికినంత సంతోషంగానే చెప్పాలి. అటువంటి పోష్ కాలనీలో వున్న తన యిల్లు, ఎక్కువ సదుపాయాలున్న యిల్లు, మిగిలిన యిళ్ళ కన్న తక్కువ అద్దె వున్న యిల్లు యింతవరకూ భర్తీ కాలేదంటే బాధగానే వుంది.

ఈ రోజుల్లో "టులెట్" బోర్డు పెట్టక్కర్లేకుండానే లారీలోకి సామాన్లు ఎక్కిస్తుంటేనే జనం ఎగరేసుకుపోతారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా వుంది. వారం రోజులు సునాయాసంగా దొర్లిపోయాయి. ఎవరూ గుమ్మం తొక్కలేదు. కనీసం సుందరమ్మగారైనా తెలిసినవారిని చేర్పించలేదు. మూడేళ్ళు హాయిగా వుండి, అప్పారావు నుంచి ఏ మాటా పడకుండా, యిబ్బంది లేకుండా కాలక్షేపం చేసి - కేవలం రెండు రోజుల ముందర "అసలు విషయం" చెప్పి వెళ్ళిపోవటం ఆలోచిస్తుంటే అతని రక్తం వేడెక్కుతూంది.

ఇప్పుడేం చేయాలి! పోనీ "టులెట్" బోర్డు పెడితే! కాని మరుక్షణంలోనే అది అవమానంగా తోచింది. తన యింటికన్నా చిన్నది ... సదుపాయాలు అంతగా లేనిది ... ఎక్కువ అద్దె వున్నది - అదే కాలనీలో వున్న మూడు యిళ్ళు యిట్టే భర్తీ అయ్యాయి. అప్పారావుకి యీ పదేళ్ల కాలంలో ఎప్పుడూ యిటువంటి పరిస్థితి ఎదురవలేదు. ట్రాన్సఫరు, క్వార్టరు యివ్వటం, పెద్ద సంసారం కారణంగానే సుందరమ్మగారికి ముందున్న వాళ్ళు వెళ్ళిపోయారు ...

కాని సుందరమ్మగారు వెళ్ళిన కారణంఎవరూ హర్షించలేనిది! అందుకు అప్పారావు బాధ్యుడు కాదు. సదుపాయాలు కల్పించి, వాటిని వుపయోగించుకోమని చెప్పటం మంచిదికాదు! సరిగ్గా యిదే అపవాదు ఆవిడను బాధించి యిల్లు ఖాళీ చేసేందుకు తోడ్పడింది. చివరికి అప్పారావుకి ఓ ఆలోచన వెన్నుతట్టింది. "టులెట్" బోర్డు పెట్టటం తప్ప మరో గత్యంతరంలేదు. అంతే, వెంటనే డ్రాయింగు పేపరు, ఎర్ర సిరా, అరటావు సైజు అట్ట తీసుకొని వ్రాయసాగాడు. సరిగ్గా ఆ సమయంలో గుమ్మంలో ఓ ఆకారం నిలబడినట్లు నీడగా కనిపించింది. తలెత్తి చూసాడు. అతను ... ఎదురుగా సుందరమ్మగారు!

ఎందుకొచ్చినట్లు ... తనకు ఏమి బాకీ లేరే .... కరెంటు, నీళ్ల ఛార్జీలు కూడా చెల్లించారు. ఈ రాకలోని అంతర్యం ఏమిటో? ముందు ప్రోగ్రాం లేకుండా, చెప్పకుండా ప్రైమ్ మినిస్టరు రాజధానికొచ్చినట్లుగా... అనిపించింది.

"బాగున్నారా" అంటూ పలకరించారు సుందరమ్మగారు.

నోటితో చెప్పలేక, కళ్లతోనే జవాబు చెప్పాడు అప్పారావు.

"వదినగారున్నారా" అంటూ లోపలకు నడిచారు

ఆవిడ.

ఆలోచనలు అప్పారావుని నిలవనీయటంలేదు. టులెట్ బోర్డు రాసేందుకు చేయి వణుకుతోంది.

* * * * * *

సుందరమ్మగారికి సంతానం ఎక్కువే! ముగ్గురు కొడుకులు వుద్యోగాలు చేస్తూ మద్రాసు, కోయంబత్తూరు, విశాఖపట్నంలో వుంటున్నారు. ముగ్గురే కూతుళ్ళతో ఆవిడ అప్పారావు యింటికి అద్దెకోసం వచ్చారు. పెద్దకూతురు రైల్వేలో స్టెనోగ్రాఫరు ... రెండో కూతురు ఏ. జీ. ఆఫీసులోను ఉద్యోగాలు చేస్తున్నారు. మూడో కూతురు బి. ఎస్సి. చదువుతోంది. కొడుకులకి వివాహాలు అయ్యాయి. ఆడ పిల్లలకు ఎందుకో వివాహాలు చేయలేదు ఆవిడ.

మూడేళ్ళ క్రితం సుందరమ్మగారు అప్పారావు యింటికి వచ్చారు. తన గురించి చెప్పి, పిల్లల గురించి చెప్పిందావిడ. తన గురించి తెలిసినవాళ్ళ పేర్లు చెప్పింది. "నాకు మీ యిల్లు కావాలి ... నచ్చింది. ఇవ్వాలి" అన్నదావిడ.

అప్పారావు ఒ క్షణం ఆలోచించాడు.

"మీకు నావల్ల ఏమీ ఇబ్బంది వుండదు. ఫస్టు తారీఖుకి అద్దె యిచ్చేస్తాను. మా చుట్టాలు దగ్గర్లోనే వున్నారు. మూడో అమ్మాయికి కాలేజీ దగ్గర. ఈ రోజుల్లో బస్సుల్లో వెళ్ళి రావటం అంటే బాధే కదా ... దయచేసి నాకు మీ యిల్లు యివ్వండి" అంటూ పర్సులో చేయిపెట్టారు డబ్బు యిచ్చేందుకు.

"మీకుయిల్లు నచ్చిందికదా ... సదుపాయాలు తృప్తికరమేగా ... పోతే ... " అంటూ ఆగాడు అప్పారావు ఓ క్షణం.

"మా ఇంటికి చుట్టాలు, స్నేహితులు ఎవరూ రారు. వచ్చినా రెండు మూడు రోజుల కంటే వుండరు." అప్పారావు వుద్దేశాన్ని గ్రహించినట్టుగా చెప్పారు సుందరమ్మగారు. అతన్ని మరో విషయం ఆలోచింపజేస్తోంది.

సుందరమ్మగారు తన ధోరణి కొనసాగించారు.

"మీ మొక్కలకు రోజు నీళ్ళు పోస్తాము. మీ అనుమతి లేకుండా పూలు కోయం ... మా యింటిలాగే చూసుకుంటాం. ఇల్లు పాడు చేస్తామని భావించకండి ... ఇల్లు ఖాళీ చేసేటప్పుడు మీ యింటిని పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాము." అంటూ.

"రేపు చెప్తాలెండి" అని అన్నాడు అప్పారావు ఆలోచించుకునేందుకు.

"కాని మాకు మీ యిల్లు యివ్వాలి ... ఆడదాన్ని, ఆడపిల్లలున్నదాన్ని, తిరగలేను" అంటూ అర్థించిందావిడ వెళ్ళే ముందు.

"అప్పారావు ఆలోచించేది లేదు. ఇల్లు యిచ్చేవరకూ చాలామంది యిలాగే అర్థిస్తారు. ఎన్నికల్లో నాయకులు వాగ్దానాలు చేసినట్టు ... నిరుద్యోగులు చెప్పినట్టు ... ఆ తరువాతే కథ మరో మలుపు తిరుగుతూంది. ఖాళీ చేయమంటే ఎదురు తిరగటం ... కోర్టుకెక్కటం ... పోట్లాడటం ... ఇలా రక రకాల అస్త్రాలు ప్రయోగించటం

హలో! — గీతా

వాంటెడ్ టెనెంట్

మామూలే. తనకే అవి అనుభవాలయ్యాయి. ఒకసారి -

సూర్యనారాయణ అప్పారావు కొలీగు. ఇల్లు నిర్మాణం నుంచి తనని వేధించసాగాడు. పోనీ కదాని ... కొలీగని యిల్లు యిచ్చాడు అప్పారావు.

సూర్యనారాయణతో పాటు, భార్య, ముగ్గురు తమ్ముళ్ళు, తల్లి మాత్రమే వుంటామని చెప్పాడు అతను. సరే అన్నాడు అప్పారావు. మొదటి తారీఖున అద్దె యిచ్చి, పదో తారీఖున వచ్చి చేరతామని చెప్పి వెళ్ళిపోయాడు. పదో తారీఖున వాళ్ళు వచ్చి చేరారు. ఇరవై తేదీనాటికి అతని నలుగురు చెల్లెళ్ళు వచ్చారు. సంఖ్య పదికి పెరిగింది. ఇల్లు సరిపోక, సామానులు సర్దుకోలేక, జనాన్ని సముదాయించలేక అవస్థపడేవాడు సూర్యనారాయణ.

రెండో నెల అద్దె యిచ్చేందుకు వచ్చాడు సూర్యనారాయణ. మొదటి నెలలో పది రోజులకు అద్దె తగ్గించి యివ్వబోయాడు అతను.

"ఇదేమిటి" అని అడిగాడు అప్పారావు.

"అవును, మేము పదో తేదీన చేరాంగదా. అంతవరకు యిల్లు నీ ఆధీనంలో నే వుంది కదా ..." అని సర్ది చెప్పబోయాడు కొలీగు.

"కాని యిల్లు నీకు యిచ్చినట్లే కదా ... మినహాయిస్తే ఎలా"

"అప్పారావు ...నిన్నటి వరకూ నువ్వు అద్దెకున్నవాడివి. అప్పుడే యింటి యజమాని లెవెల్లో మాట్లాడుతున్నావు. పది రోజులు నేను లేను కాబట్టి అద్దె యివ్వనవసరంలేదు". నిశ్చయంగా చెప్పాడు సూర్యనారాయణ.

అప్పారావు ఖంగుతిన్నాడు. "నువ్వు ఎవరినైనా అడుగు. నీకు ఏది మంచిదని తోస్తే అలా చేయి. నేను నువ్విచ్చే అద్దెమీద బతకడంలేదు. ఆలస్యమైనా ఫరవాలేదు. ఈ అద్దె తీసుపో" అంటూ తిరిగి యిచ్చేసాడు అతను.

"ఇంత నిక్కచ్చిగా వుండటం మంచిదికాదు."

"నేను డబ్బుకంటే మనిషికి, మాటకు విలువ నిస్తాను. ఆ విషయం నువ్వు గ్రహించే వుంటావు. కొలీగువని యిల్లు ఇస్తే యిలా మాట్లాడటం భావ్యంకాదు. నాతో ఆరుగురుంటామని చెప్పావు. కాని పదిమంది వుంటున్నారు. మీరు యిబ్బందిపడటం నాకు కష్టంగా వుంటోంది." చెప్పాడు అప్పారావు బాధపడుతున్నట్టుగా.

"చూడు అప్పారావ్ ... బాధపడినా, యిబ్బందిపడినా అది నా విషయం. మీ యింట్లోకి జనాన్ని తోలటంలేదు కదా ... పైగా వున్నవాళ్ళని ఎక్కడకు పంపించమంటావు ... ఆ నలుగురికీ విషంపెట్టి చంపేయమంటావా ..." కోపంగా అన్నాడు సూర్యనారాయణ.

ఆ ధోరణి అప్పారావుని బాధించింది. "ఇక్కడ నేను యింటి యజమానిని నువ్వు టెనెంటువి అని మరిచిపోదాం కాసేపు. కాని నీ మీద ఆధారపడ్డ మనుషులు ... నీకున్న సామానులు ... నీకు తెలీవూ! ఇల్లు నాలుగైదుసార్లు చూసావు కదా ... వూళ్లోవాళ్ళ దగ్గర చిన్న గదులు ఉంటే, వాళ్ళేమి పెద్దది చేస్తారా... నిన్ను ఆదుకుంటారా... నావల్ల నీకు యిబ్బంది వుంటే చెప్పు ...అంతేగాని యితరుల దగ్గరనడం బాగోలేదు." నచ్చచెప్పాడు.

ఈ విధంగా సూర్యనారాయణ మాట్లాడేవాడు. రోజూ సామానులు మార్చేవాడు. రాత్రి పన్నెండు, ఒంటి గంట వరకూ వాళ్ళింట్లో గొడవగా వుండేది. ఫలితంగా అప్పారావుకి చికాగ్గా వుండేది. కొలీగు, స్నేహితుడు అన్న కారణంతో మవునంగా వుండేవాడు. అది లోకువగా భావించాడు సూర్యనారాయణ. అయినా సర్దుకు పోయేవాడు అప్పారావు.

ఏడు నెలల తరువాత సూర్యనారాయణ హటాత్తుగా యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు. అప్పుడు అప్పారావు, ఫామిలీ పెళ్ళికి వెళ్లారు. తిరిగివచ్చేసరికి తాళం కప్ప దర్శనమిచ్చింది.

"నీకు యిబ్బంది కలిగించటం యిష్టంలేక ఖాళీచేసాను. ... ఇవిగో తాళం చెవి" అంటూ తాళం చెవి యిచ్చాడు సూర్యనారాయణ రెండు రోజుల తర్వాత.

"సూర్యనారాయణా ... నేను నువ్వనుకున్నంత వెధవనుకాను. కేవలం స్నేహానికి విలువిచ్చి సర్దుకుపోయాను. కాని నువ్వెందుకు ఖాళీచేసావో ఏ యింటికి వెళ్ళావో నాకు తెలిసింది. అది వదిలేయ్ ... కరెంటు రీడింగు చూసుకున్నావా ..."

"అంతా చూసాను. నేను మొత్తం రెండు వందల నలభై రూపాయలు కరెంటుకి, నలభై ఎనిమిది రూపాయలు నీళ్ళకు యివ్వాలి ... మళ్ళీ నెలలో ప్రావిడెంటు ఫండు లోను పెట్టి యిస్తాను"

అన్నాడు సూర్యనారాయణ.

"ఒక్క విషయం గుర్తుంచుకోవాలి నువ్వు. నువ్విదివరలో వున్నవాళ్లకుదాదాపు ఆరొందలు కరెంటు, నీళ్లకు బాకీపడ్డావు. నాకు తెలుసు. వారికి ఎంత యిచ్చావో నీకు తెలుసు. ఇప్పుడు నామీద ఆ తెలివితేటలు ప్రదర్శిస్తున్నావు. నిజంగా యిస్తావా" నిలదీసినట్టుగానే అడిగాడు అప్పారావు.

సూర్యనారాయణకు కోపం వచ్చింది. "అంటే నీ బాకీ యివ్వననా నీ వుద్దేశం ..." అన్నాడు వెంటనే.

"కోపం వద్దు. నా యిల్లు కాళీచేసి వెళ్లిపోయినా, మనమిద్దరంయీ ఆఫీసులో కొలీగ్సు అన్న విషయం మరిచిపోకు. ఈ బాకీ నీకు గుర్తుకు వచ్చినప్పుడల్లా గిల్టీగా వుంటుంది నీకు. కాని ఓ విషయం గుర్తుంచుకో ... నువ్వు యిల్లు కట్టేక, నీకు ఓ టెనెంటు వచ్చాక, వాడు నీలాగే ప్రవర్తిస్తే ఎలాగుంటుందో అప్పుడు తెలిసివస్తుంది. డబ్బు శాశ్వతంకాదు. కాని మనిషి మాట, ప్రవర్తన నిలిచిపోతాయి. తెలివైన టెనెంటు పనికిమాలిన యింటి యజమానికి తోడుగా వుంటాడు - అనే నిజం నాకిప్పుడిప్పుడే బోధపడుతోంది. నువ్వు చెల్లించాల్సిన బాకీలో కనీసం సగమైనా యిచ్చేందుకు ప్రయత్నించు". అప్పారావు సుదీర్ఘంగా చెప్పాడు.

నేటివరకూ ఆ బాకీ చెల్లుకాలేదు.

ఇప్పుడు అప్పారావు ఆలోచనల్నుంచి తేరుకున్నాడు.

అన్నమాట ప్రకారంమర్నాడు వచ్చారు సుందరమ్మగారు. పర్సులోంచి డబ్బు తీసి యివ్వబోయారు ఆవిడ.

"ఆడవాళ్లు ... మగతోడు లేని సంసారం" అని జాలిపడి యిల్లు యిచ్చాడు అప్పారావు.

రెండు సంవత్సరాలు సాఫీగా గడిచాయి. సుందరమ్మగారు నిజంగా దేవత. మంచి మనసున్న స్త్రీమూర్తి. కాని సంతానానికి ఆ పోలికలు లేకపోవటం దురదృష్టమే. కూతుళ్లు రోజూ ఏదో విషయంలో పోట్లాడుకునేవాళ్లు. పెద్దకూతురికి టీ. వీ. రెండో కూతురికి రేడియో కార్యక్రమాలు, మూడో కూతురికి పత్రికలు కావాలి. ఈ విషయంలో తరచు సంఘర్షణే! పోటీపడి టీ. వీ. రేడియో గొంతు పెంచేసేవారు. ఈ పోట్లాట సుందరమ్మగారికి గుండె దడని, బి. పీని పెంచేవి. కూతుళ్లిద్దరికీ ఉద్యోగస్తులమనే అతిశయం, అహంభావం వుండేవి. మాటల్లో స్పష్టంగా తెలిపేవారు.

"ఇంత యిల్లు కట్టేరు ... కిచెన్ ప్లాట్‌ఫారం మీద తాండూరుషాబాద్ స్టోను, గోడకి పింగాణీ టైల్సు వేయించలేదే" అని అడిగింది సుందరమ్మగారి పెద్దకూతురు ఓసారి.

"ఆలోచిస్తున్నాను ... త్వరలో వేయిస్తాను." అన్నాడతను.

"నీళ్లకు తొట్టిలు కట్టించండి ... బావికి చప్టా వేయించండి." రెండో కూతురు అడిగింది యీసారి.

"అప్పారావుగారు పరిశీలిస్తున్నారు" ఠక్కున అంది మూడో కూతురు నవ్వుతూ.

వాంటెడ్ టెనెంట్

అప్పారావు వారి తెలివితేటలకు, సమయస్ఫూర్తికి నవ్వుకున్నాడు.

"ఆరు నెలల్నుంచీ దాటుకు పోతున్నారు మీరు. పనిలో పని యింటి చుట్టూ నాపరాళ్లు వేయించండి... శుభ్రంగా, అందంగా వుంటుంది" అన్నారు ముగ్గురు కూతుళ్లు ముక్తకంఠంగా - ఓ రోజు.

ఈ సదుపాయాలు సుందరమ్మగారు అడిగిస్తున్నారో ... లేక వాళ్లే ఆటపట్టించేందుకు అంటున్నారో అప్పారావుకు అర్థంకావటంలేదు. వారి నోటికి తాళం వేసే వుద్దేశంతో తను ఆ పనులకు సిద్ధమయ్యాడు. దాదాపు ఎనిమిదివేల దాకా ఖర్చు అయింది.

మరో దెబ్బ! నగరంలో నీటి ఎద్దడి ఏర్పడింది. రోజు విడిచి రోజు నీళ్లు వదులుతున్నారు. అదైనా సరిగా రావటంలేదు. వచ్చినా నీళ్లు చాలటంలేదు. ఈ విషయంలో కూడా మళ్లీ సుందరమ్మగారి కూతుళ్లు అప్పారావుని ఆటపట్టించసాగారు. టెనెంట్సుకి సదుపాయాలు కల్పించడని అపవాదు పడేసారు.

"బావి తవ్వించండి ... నీళ్లు చాలటంలేదు కదా" అంది అతని శ్రీమతి ఓ రోజు వారి ధోరణికి జవాబుగా.

అప్పారావు రెండేళ్లలో బావిని అయిదుసార్లు తవ్వించాడు. ఎండలకు, చుట్టుపక్కలవాళ్లు బోరింగులు వేయించటంతో నీళ్లు నిలిచేవికాదు. బావి లోతు పాతిక అడుగులకు పెరిగింది. బావి పూర్తిగా ఎండిపోయింది - ప్రస్తుతం. కరెంటు లేకపోతే కిరసనాయిలు దీపంతో కాలక్షేపం చేయవచ్చు కాని లేచినప్పట్నుంచి, పడుకునే వరకూ నీళ్లు కావాలి. దీనికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు. అందుకే అయిదువందలు ఖర్చుచేసి రెండు గజాలు తవ్వించాడు అప్పారావు. అదృష్టం బాగుంది. రోజూ నీళ్లు తోడినా మర్నాటికి గజం లోతు నీళ్లు వుంటున్నాయి. అతనికి, సుందరమ్మగారికి చాలా సంతోషంగా వుంది. లాటరీలో బహుమతి వచ్చినంత ఆనందంగా వుంది.

కాని దురదృష్టం అప్పారావుని మరో రూపంలో వెంటాడుతూనే వుంది. సుందరమ్మగారికి ఓ పనిమనిషి వుంది. దానికున్న పొగరు, గర్వం, దర్పం మరెవరికీ, వుండదేమో ... నిర్లక్ష్యం, బద్ధకంకు మరో పేరుగా దాన్ని చెపచ్చు. చెప్పినపని చేయకపోవటం దాని కలవాటు. చేసే పని అసహ్యంగా వుంచటం మరో అలవాటు. పెరడు తుడవదు. నీళ్లు చల్లదు. తుక్కు ఏరి బయటకు వేయదు. అప్పటికి సుందరమ్మగారు ఎన్నోసార్లు చెప్పారు. వినిపించుకొనే గుణం దానికి లేదు. మళ్లీ మళ్లీ చెప్తే పని మానేస్తుందేమోనన్న భయంతో చూసీ చూడనట్టుగా వుండేవారు వాళ్లు. అక్కడికీ నాలుగైదుసార్లు అప్పారావు కూడా చెప్పి చూసాడు. దానికి పనిమనిషి సమాధానం యిలా వుంది. "నువ్వు నాకు చెప్పక్కర్లేదు. నేను నీ పనిమనిషిని కాదు. కావాలంటే తుడిపించుకో" అంటూ చీపురు పడేసింది. అప్పట్నుంచీ చెప్పటం మానేసాడు తను.

ఆఫీసుల్లో ఉద్యోగులే పనిచేయరు. అటువంటిది పనిమనుషుల చేత చేయించటం కంటే అంతరిక్షం లోకి షికారుకి వెళ్లటం తేలికేమో!

నూతిలో నీళ్లున్నా బాధ తప్పలేదు. రోజూ సుందరమ్మగారి కూతుళ్లు ఏదో రూపంలో విమర్శించేవాళ్లు అప్పారావుని.

"నీళ్లు తోడుకోడం కష్టంగా వుంటోంది. మోటారు పెట్టించండి". అని వాళ్లు రెండు మూడుసార్లు అడిగారు.

అప్పారావు సుందరమ్మగారి సమక్షంలో చేతులు జోడించాడు. "క్షమించండి. నాకు శక్తిలేదు. ఎందరి బావులకు మోటారులున్నాయి? నీళ్లు తోడుకోడం కష్టము. ... పనిమనిషిని వుంచుకుని కూడా దానిచేత పని చేయించుకోలేక పోతున్నారు. అది కాకపోతే మరొకటి! దేశంలో బోలెడుమంది తిండిలేక తిరుగుతున్నారు. మీరు దాన్ని అలా వుండనిస్తే, అది మీ చేతకానితనంగా భావించి మొండికెడుతుంది. వారానికోసారి నేను కూలిమనిషి చేత మీ వైపు తుడిపించి, కడిగిస్తున్నాను. అందుకు డబ్బు నేను మిమ్మల్ని అడగడంలేదు. రేపు డాబా ఎక్కేందుకు కష్టంగా వుందని, లిఫ్టు పెట్టించమని అడగొచ్చు మీరు ...దయచేసి అర్థం చేసుకోండి

"మేము అప్పు యిస్తాం ... చేయించండి" అంది పెద్దకూతురు.

"నాకు అప్పు అంటే భయం. నా దృష్టిలో అది నిప్పులాంటిది. ఓ విషయం మీరు గుర్తుంచుకోండి. రేపు నీకు పెళ్లవుతుంది. పిల్లలు పుడతారు. వాళ్లు అది కావాలి ... యిది కావాలి అని నిన్ను అడుగుతారు. అన్నీ తీర్చేయగలవా? అవసరం, అనవసరం గురించి ఆలోచించేది తల్లి, తండ్రి. ఇంటి విషయం కూడా అంతే. అలమారాలకు తలుపులు పెట్టించమని నువ్వు యింకా అడగనందుకు నాకు సంతోషంగా వుంది. మీ అమ్మగారు మీ ఆయనకు ఎంతవరకు కోరికలు తీరుస్తారో మరి!" విపులంగా చెప్పాడు అప్పారావు.

"దానికీ దీనికీ సామ్యం ఏమిటి? బట్టతలకు,

అందమైన అవినీతి

నీతీ న్యాయం
లేవు వాడికి!
తప్పులూ దోషాలూ
నెమిలి కన్నుల వలె
అందంగా ఆకర్షణీయంగా
వాడి బతుకంతటా
నిండిపోయాయి–
అవి మనల్ని రక్షించక
వాణ్ణి రక్షిస్తున్నాయి;
వాణ్ణి భక్షించక
మనల్ని భక్షిస్తున్నాయి!

–కలువకొలను సదానంద

ఈ వేమన పద్యాలు

నేరనన్నవాడు నెరజాణ మదిలోన
నేర్తునన్నవాడు వ్యర్థుడెందు
నూరకున్నవాడె యుత్తమ యోగిరా
విశ్వదాభిరామ వినురవేమ.

మోకాలికి పోలికా"

"అంతా ఒక్కటే ... అర్థం చేసుకుని ఆలోచిస్తే ఏ విషయమైనా సరిపోతుంది. ఆ మాత్రం ఓపిక మనకుండాలి" అతని జవాబు.

ఆ తరువాత వారి పెద్దకూతురు ఓ మనిషిని తీసుకొచ్చి బావిని చూపించి మోటారుకు అయ్యే ఖర్చు గురించి విచారించింది. అందుకు అభ్యంతరం పెట్టాడు అప్పారావు.

"ఇది బాగోలేదు. మీ పిల్లలు చదువుకోవచ్చు. ఉద్యోగస్తులు కావచ్చు. అంతమాత్రాన యిలా చేయటం బాగాలేదు. మీకు నీళ్ళు తోడుకోటం కష్టమైతే, నేను పనిమనిషిని పెట్టి తోడిస్తాను. అందుకు ఖర్చు యివ్వనవసరంలేదు. అంతేగాని నా యింటికి, నా బావికి, నా అనుమతి లేకుండా యిలా మనుషుల్ని తీసుకొచ్చి బేరసారాలు చేయటం ఏం బాగాలేదు." అన్నాడతను బాధపడుతూ.

వాంటెడ్ టినెంట్

"అంటె మీ ఉద్దేశంలో మేమంత గతిలేని వాళ్ళమా!" ఎదురు తిరిగింది రెండో కూతురు.

"జవాబు మీ అమ్మగారే చెప్పాలి".

సుందరమ్మగారు మౌనం వహించారు.

"ఈ కాలంలో కూడా బజారులో దొరికే... సదుపాయాలు అనుభవించకపోవటం దురదృష్టం దేనికైనా పెట్టి పుట్టాలి." పెద్దకూతురు లోపల్నుంచి గొణగటం అప్పారావుకి వినిపించింది.

"నిజమేనమ్మా ... నాకు యోగంలేదు. పాకులాడటం చేతకాదు. ఏదో యింతవరకే పెట్టి పుట్టాను. నేను మరే సదుపాయాలు కల్పించలేను. నా యిల్లు ఖాళీగా వున్నా భరిస్తాను." చివరిసారిగా చెప్పాడు.

"మీ దృష్టిలో యిదొక్కటె యిల్లా ... డబ్బు పడేస్తే బోలెడు యిళ్ళు దొరుకుతాయి. రెండు రోజుల్లో యిల్లు ఖాళీ చేస్తాం ... చూస్తూ వుండండి." అంటూ ఛాలెంజి చేసింది ఆ అమ్మాయి.

"నువ్వు వయసుకి మించి మాట్లాడుతున్నావు. అనుభవానికి దాటి అవసరాలు కోరుతున్నారు. నేను ఖాళీ చేయమని చెప్పను. కాని నేను ఖాళీ చేయించానని అనకుండా వుంటే అదే పదివేలు. ఆ తరువాత మీ యిష్టం."

అంతే, సుందరమ్మగారు యిల్లు ఖాళీ చేసేసారు.

* * * *

ఇప్పుడు సుందరమ్మగారి రాకలోని ఆంతర్యం అప్పారావుకి తెలియకపోలేదు. అతనింటి నుంచి వాళ్ళు శారదానగర్‌కి మారిపోయారు. ఆ యిల్లు ఎగువ భాగాన వుండటంతో గాలికి లోటు లేకపోయినా నీటికి మాత్రం యిబ్బంది. కుళాయి నీళ్ళు ప్రెషరు లేకపోవటంతో పై భాగానికి వచ్చేవికాదు. కింద నుంచి మోసుకెళ్లాలి. ఇద్దరు కూతుళ్ళు ఉద్యోగాలకి, మూడో కూతురు కాలేజీకి వెళ్ళిపోతే యిక మిగిలేది సుందరమ్మగారు. ఆవిడ బిందెలతో నీళ్ళు పైకి తీసుకెళ్ళగలదా అంటే ఆయాసం ... అదిగాక కింద భాగంలో యింటి యజమానితో పాటు మరో రెండు వాటాల వాళ్ళున్నారు. మొత్తంమీద నాలుగు వాటాలకు సరిపోయే నీళ్ళు కావాలి. అసలు గండిపేటలోనే నీళ్ళు లేకపోతే కుళాయిల్లో నీళ్ళు ఎలా వస్తాయి! ఈ యిబ్బందుల కారణంగా ఆ యింట్లో తరచు పై వాటా ఖాళీ అవుతుంటుంది. అసలు యింట్లో బావి వుంటే ఏదో టైములో తోడుకోవచ్చు. ఆ మాత్రానికి బాధపడితే, ఒళ్ళు కందిపోతుందనుకుంటే ఏం లాభం! వంద రూపాయలు ఎక్కువిచ్చి నీళ్ళులేని యింట్లో కాపురం ఎలా! ఆ తల్లికూతుళ్ళు బాగా చర్చించుకున్నారు ...

ఈ విషయంలో తల్లీకూతుళ్ళు మరుసటి రోజు నుంచి తగువుపడసాగారు. అప్పారావు యింట్లోని బావిలో చేద వేయనివాళ్ళు, మరో యింటికి వెళ్ళి నీళ్ళు తెస్తారా ఉద్యోగస్తులైన పిల్లలు ... పనిమనుషులు!

"నేను మళ్ళీ మీ యింటికే వస్తాను." అన్నారు సుందరమ్మగారు. ఇప్పుడు ఆలోచనలో పడ్డాడు అప్పారావు మళ్ళీ. ఇల్లు యివ్వాలా వద్దా అని!

"మళ్ళీ నా యింటికేనా ... అసలు యింట్లో చేరి దీపం పెడితే చాలనేయింటి యజమానులు బోలెడుమందున్నారు. పైగా ఉద్యోగాలు దొరక్కపోయినా, యిళ్ళకు ఆ పరిస్థితి రాలేదు. మీ అమ్మాయిలను సంప్రదించారా!" అని అన్నాడు అతను.

"వారి మాటలు పట్టించుకోకండి. చిన్నతనం. ఈ నెల అద్దె వదులుకుని రేపే మీ యింట్లో చేరిపోతాం. ఇదిగో యీ నెల అద్దె ... దయచేసి యిల్లు యివ్వండి." అర్థించారు ఆవిడ. అప్పారావుకి ఆవిడ మీద జాలి కలిగింది. డబ్బు అందుకున్నాడు. ఆ సాయంత్రమే వారు చేరిపోయారు. ఇప్పుడెవరికీ పట్టింపులు, పంతాలు లేవు ... □